



జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

- ప్రధాన కార్యాలయంలో ప్రతి విభాగం పరిశీలన
- మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం
- 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?'... అంటూ కార్యాలయం ఇన్‌చార్జిపై అసహనం

- వార్త 7వ పేజీలో

వరి నారుమడులు నీళ్లపాలు

జిల్లాలో 795 ఎకరాల్లో నీటమునిగిన నారుమడులు



అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో వరి నారుమడి నుంచి నీరు మళ్లిస్తున్న దృశ్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నారుమడులు నీట మునిగాయి. జిల్లాలో 795 ఎకరాల్లో వరి నారుమడులు నీటమునిగాయని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. జిల్లాలో గత నాలుగు రోజుల్లో సాధారణ వర్షపాతం 257 మిల్లీ మీటర్లకు గాను 408 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో వరి నారుమడులు నీళ్ల పాలయ్యాయి.

- అధిక వర్షాలే కారణం
- 2,662 మంది రైతులు నష్టపోయారని అంచనా
- వారందరికీ విత్తనాల పంపిణీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు



కశింకోట మండలంలో నీళ్లపాలైన వరి నారుమడి

అధిక వర్షాల కారణంగా జిల్లాలో 24 మండలాల్లో సగానికి పైగా మండలాల్లో ఈ నెల 10వ తేదీ నాటికి వేసిన వరి నారు మడులు నీళ్లలో మునిగిపోయాయి. ఎక్కువగా అనకాపల్లి, మునగపాక, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, చోడవరం, చీడికాడ, కోటవురట్ల, మాకవరపాలెంలలో వరి నారు మడులు నీట మునిగాయి. మండల వ్యవసాయాధికారులు బుధవారం నాటికి అందించిన నివేదికల ఆధారంగా జిల్లా వ్యవసాయాధికారులు 14 మండలాల్లో 94 గ్రామాల్లో వేసిన 320 ఎకరాల వరి నారు మడులు, అదే విధంగా ఎదచల్లే పద్ధతిలో వేసిన వరి 475 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. నష్టపోయిన రైతులు 2,662 మందికి పైగా ఉంటారని అంచనా వేశారు.

నష్టపోయిన రైతులకు విత్తనాలు

జిల్లాలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన వరి సాగు చేసే రైతుల అభ్యర్థన మేరకు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపామని జిల్లా వ్యవసాయాధికారి ... మిగతా 8వ పేజీలో

సొసైటీల నెత్తిన గోదాముల భారం

అవసరం లేదన్నా కట్టి తీరాలని హుకుం

- గత వైసీపీ సర్కారు నిర్వాకం

- గ్రామాలకు దూరంగా నిర్మాణం... లోప భూయిష్టం
- కడప కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- బిల్లుల కోసం జిల్లా అధికారుల సమక్షంలోనే బెదిరింపులు
- విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే వెలుగులోకి అక్రమాలు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వంలో అస్మదీయులైన కాంట్రాక్టర్లతో ఉమ్మడి జిల్లాలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు వ్యవసాయ సహకార పరపతి సంఘాలపై అప్పులభారం మోపాయి. వద్దు మొర్రో అన్నా అధికారుల మాటలు వినకుండా నాబార్డు నుంచి రుణం తెచ్చి మరీ కోట్లు పోసి నిర్మించిన గోదాములు ఇప్పుడు నిరుపయోగంగా పడిఉన్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించిన ఈ గోదాములు ఏడాదిన్నర గడిచినా ఖాళీగా ఉన్నాయి. దీంతో వీటి నిర్మాణాలకు తీసుకున్న అప్పులు తీర్చడానికి నాబార్డు నుంచి నోటీసులు వస్తే ఆర్థికంగా చితికిపోతామని సొసైటీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. అంతేకాదు గోదాముల నిర్మాణం మొత్తం లోపభూయిష్టంగా, నాసిరకంగా ఉండడంతో పైనుంచి వర్షం నీరు కారిపోతోందని, సరైన ప్రమాణాలతో నిర్మించనందున ఎక్కువ కాలం ఉండవని పలువురు పెదవి విరుస్తున్నారు.



బుచ్చెయ్యపేటలో నిర్మించిన గోదాము



కశింకోట మండలం జమాదులపాలెంలో నిర్మించిన గోదాము

రాష్ట్రంలో ఆహార ధాన్యాలు, నిత్యావసర సరకుల నిల్వకు వందల సంఖ్యలో గోదాముల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం నాబార్డు నుంచి రుణం తీసుకువచ్చింది. గోదాముల నిర్మాణానికి అయ్యే ఖర్చు సదరు సొసైటీలే తీర్చుకోవాలి. ప్రస్తుతం గోదాములు అవసరమా?, అవసరమైతే గ్రామాలకు అందుబాటులో నిర్మించాలన్న కనీస ఆలోచన చేయలేదు. ఉమ్మడి జిల్లాలో కనీసం 50 గోదాములు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించగా, జిల్లా అధికారులు అభ్యంతరం తెలిపారు. అన్ని గోదాములను నిర్మించాల్సిన అవసరం లేదని తేల్చారు. జిల్లాలో గతంలో నిర్మించిన గోదాములే ఖాళీగా ఉన్నాయని.. కొత్తవి వద్దని చెప్పినా వారి మాటలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో చేసేది లేక తొమ్మిది గోదాములు నిర్మించేందుకు అధికారులను ఒప్పించారు. ఈ నేపథ్యంలో జమాదులపాలెం (కశింకోట), బుచ్చెయ్యపేట, నాగులాపల్లి, నాతవరం, కొత్తకోట, దిమిలి, రాంబిల్లి, శృంగవరం(కోటవురట్ల), శ్రీరాంపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో గోదాముల నిర్మాణ బాధ్యతలను కడపకు చెందిన ప్రభుత్వ అస్మదీయ కాంట్రాక్టరుకు అప్పగించారు. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.36 లక్షలు చొప్పున రూ.2,88 కోట్లు నాబార్డు నిధులు కేటాయించారు. నాగులాపల్లి, నాతవరం మినహా మిగిలిన ఏడు చోట్ల గ్రామాలకు దూరంగా గోదాములు నిర్మించాలని ప్రతిపాదించారు. శ్రీరాంపురం తప్ప మిగిలినవాటిలో ఏడు చోట్ల నిర్మాణాలు పూర్తికాగా, శృంగవరంలో సగం పనులు పూర్తయ్యాయి. నిర్మాణాలకు ఇంతవరకు రూ. 2.4 కోట్లు వెచ్చించారు.

నాణ్యత ప్రమాణాలు శూన్యం

మొత్తం తొమ్మిది గోదాముల నిర్మాణాలను 2022 మార్చిలో ప్రారంభించారు. వీటిని నిర్మించే కాంట్రాక్టరు ప్రభుత్వ అనుకూల వ్యక్తి కావడంతో జిల్లా అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. దీంతో నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదు. దీనిపై ప్రాథమిక సహకార సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తంచేశారు. నాసిరకం నిర్మాణాలతో గోదాములు బలహీనంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తూ పలుమార్లు కాంట్రాక్టరును అప్రమత్తం చేశారు. అయినా ఇవేవీ పట్టించుకోలేదు సరికదా దశలవారీగా పూర్తిచేసిన పనుల మేరకు ఎంబుక్‌లో నమోదు చేసిన వెంటనే జిల్లా అధికారుల చాంబర్‌లో కూర్చొని, బిల్లుల విడుదలకు సహకార శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చేవారన్న ఆరోపణలున్నాయి. నాణ్యతతో సంబంధంలేకున్నా ఎంబుక్ నమోదైతే చాలు బిల్లులు మంజూరుచేస్తూ జిల్లా అధికారులకు నివేదిక సమర్పించే వరకు వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చేవారని సమాచారం. ఒకవేళ ఎవరైనా ఆలస్యంచేస్తే ప్రాథమిక ... మిగతా 8వ పేజీలో

రహదారులు ఛిద్రం.. ప్రయాణం దుర్లభం



పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద బీఎన్ రోడ్డు పరిస్థితి

గోతులమయంగా బీఎన్ రోడ్డు

- అధ్వానంగా పీఎస్ పేట రోడ్డు
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

చోడవరం, జూలై 24:

అసలే గోతులు.. ఆపై వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ కేంద్రంలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారులపై దృష్టి సారించకపోవడంతో గోతులమయంగా ఉన్న రహదారులు తాజా వర్షాలతో మరింత దారుణంగా ఉన్నాయి.



మండలంలోని అంభేరుపురం వద్ద చోడవరం- అనకాపల్లి రోడ్డు పరిస్థితి

బీఎన్ రోడ్డులోని కొత్తూరు జంక్షన్ వద్ద రోడ్డు వర్షాలకు దెబ్బతిన్నది. ఇక్కడ వేసిన గ్రావెల్ వర్షానికి కొట్టుకుపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని అంబేరుపురం జంక్షన్ సమీపంలో దెబ్బతిన్న రోడ్డుకు గతంలో తారుపూత వేసినప్పటికీ, తాజాగా కురుస్తున్న వర్షాలకు అక్కడ నీరు నిల్వ ఉండిపోయి, రోడ్డు మళ్లీ గోతులమయంగా మారింది. ఇక చోడవరం- దేవరాపల్లి రోడ్డులో కొత్తూరు జంక్షన్ సమీపం నుంచి రేవళ్లు వరకు గల ప్రధాన రహదారి కూడా గోతులమయంగా మారింది. చోడవరం-చీడికాడ రోడ్డు పూర్ణా థియేటర్ సమీ పం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు గోతులతో అధ్వానంగా మారింది.

దయనీయంగా పీఎస్‌పేట రోడ్డు

ప్రధాన రహదారులతో పాటు చోడవరం నుంచి పీఎస్‌పేట నుంచి జన్నవరం జంక్షన్ వరకు రహదారి ప్రస్తుత వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని కొత్తూరు బాలికల హైస్కూల్ నుంచి కిలోమీటరు మేర తారురోడ్డు నామరూపాల్లేకుండా మారింది. పీఎస్ పేట గ్రామం ముందున్న రోడ్డు కూడా వర్షాలకు చెరువులా మారిపోయింది. పీఎస్ పేట గ్రామం దాటిన తరువాత నుంచి జన్నవరం జంక్షన్ వరకు రోడ్డు కూడా దారుణంగా ఉంది. రహదారుల మరమ్మతుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినందున అధికార యంత్రాంగం వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

భూమిని కేటాయించాకే రైల్వే జోన్ పనులు

బడ్జెట్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు రూ.10,586 కోట్లు



- వాల్తేరు డివిజన్ కూడా అందులో భాగమే...
- అమృత్ స్టేషన్ల కింద విశాఖపట్నం, దువ్వాడ, సింహాచలం, అనకాపల్లి, ఎలమంచిలి, అరకులోయ అభివృద్ధి
- కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయదలచిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీవీఎంసీ అధికారులు తగిన స్థలం కేటాయించాకే పనులు ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. 2024-25కి సంబంధించిన రైల్వే బడ్జెట్‌పై ఆయన బుధవారం ఢిల్లీలో మాట్లాడారు. విశాఖ జిల్లా అధికారుల వల్లే జోన్ పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఈ బడ్జెట్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్ ఉన్న ఒడిశా రాష్ట్రానికి రూ.10,586 కోట్లు కేటాయించారు. వాల్తేరు డివిజన్ కూడా అందులో భాగమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9,151 కోట్లు కేటాయించామని, 100 శాతం రైల్వే ట్రాకులను విద్యుద్దీకరణ చేశామన్నారు. గత పదేళ్లలో ఏపీలో ఏడాదికి సగటున 151 కి.మీ. చొప్పున కొత్త ట్రాకుల నిర్మాణం చేపట్టామన్నారు. భద్రత కోసం అనేక ప్రాంతాలో అండర్ పాస్‌వేలు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరిగిందన్నారు. ఏపీలో రూ.73,743 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. విశాఖపట్నం జిల్లా వరకు చూసుకుంటే విశాఖపట్నం, దువ్వాడ, సింహాచలం, అనకాపల్లి, ఎలమంచిలి, అరకు రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ల కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జ్వరంతో గిరిజన విద్యార్థి మృతి

- జాజులపాలెం గ్రామంలో విషాదం

చీడికాడ, జూలై 24: మండలంలోని కోనాం శివారు జాజులపాలెం గిరిజన గ్రామానికి చెందిన ఓ విద్యార్థి జ్వరంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనికి సంబంధించి బాలుడి పినతండ్రి కాకర గణేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జాజులపాలెం పాఠశాలలో కాకర లక్కీ(9) నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19న జ్వరం రావడంతో స్థానిక వైద్య సిబ్బంది వద్ద కుటుంబ సభ్యులు మందులు తీసుకుని వేశారు. ఈ నెల 21న స్థానిక ఏఎన్ఎం రాజేశ్వరి పరీక్షించి బాలుడికి జ్వరం తగ్గలేదని, వెంటనే మాడుగుల ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించింది. దీంతో ఈ నెల 22వ తేదీ ఉదయం మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ పరీక్షించి సాధారణ జ్వరమేనని మందులు ఇచ్చి ఇంటికి పంపించేశారు. అయితే సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత జ్వర తీవ్రత పెరిగింది. మంగళవారం ఉదయం మళ్లీ మాడుగుల ఆస్పత్రికి తీసుకువెళితే ఆ బాలుడిని పరీక్షించిన వైద్యాధికారులు వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని పంపించారు. అక్కడికి వెళితే విశాఖ కేజీహెచ్‌కి తరలించాలని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆ బాలుడిని మంగళవారం రాత్రి 8 గంటలకు కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల్లో ఆ బాలుడి కడుపులో రక్తం గడ్డకట్టి ఉందని, దీని వల్ల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేజీహెచ్‌లో బుధవారం ఉదయం ఆ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై బాలుడి పినతండ్రి గణేశ్ మాట్లాడుతూ సోమవారం మాడుగుల ఆస్పత్రికి తీసుకువెళ్లిన తరువాత అక్కడి వైద్యులు లక్కీని ఆ రాత్రికి ఆస్పత్రిలో ఉంచితే బతికి ఉండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్కీ తండ్రి అనారోగ్యంతో గతంలో మృతి చెందగా తల్లి లక్ష్మి ఉంది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆమె కన్నీరు మున్నీరుగా విలపించింది.

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా..

- పదోన్నతులు, బదిలీలు, నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై విచారణ కొనసాగుతుంది
- సంబంధం లేని వ్యవహారాలకు దూరంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించా..
- వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రామగిడ్డయ్య



డాక్టర్ బి.రామగిడ్డయ్య

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రాంతీయ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ బి.రామగిడ్డయ్య తెలిపారు. ఆర్డీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో పలు అంశాలపై మాట్లాడారు. ప్రాంతీయ కార్యాలయం కేంద్రంగా నిర్వహిస్తున్న జోనల్ ఉద్యోగుల పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, క్రమశిక్షణ వ్యవహారాలు, నియామకాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా బదిలీలు, పదోన్నతులు సమయాల్లో ఆర్డీ కార్యాలయంపై పెద్దఎత్తున ఆరోపణలు రావడం పరిపాటిగా మారిందని, ఇటువంటి వాటికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు రామగిడ్డయ్య తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై విచారణ కొనసాగుతున్నదన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణ ఫైళ్లను క్లియర్ చేయనున్నట్టు వెల్లడించారు.

నిరంతరం ఉద్యోగులకు అందుబాటులో ఉంటా..

ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో 20కిపైగా కేడర్లలో పనిచేసే నాలుగు వేల మంది వరకు ఉద్యోగులు తమ పరిధిలో ఉన్నట్టు ఆయన వివరించారు. ప్రాంతీయ కార్యాలయ పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చునన్నారు. నిరంతరం ఉద్యోగులకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సంబంధం లేని వ్యవహారాలకు దూరంగా ఉండాలని కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కొద్దిరోజుల కిందట సూపరింటెండెంట్లుగా 12 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు ... మిగతా 8వ పేజీలో

రంగురాళ్ల క్వారీలపై నిరంతర నిఘా



కరక రంగురాళ్ల క్వారీలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న రేంజ్ అధికారి లక్ష్మీనర్సు, సిబ్బంది

- నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు

నర్సీపట్నం, జూలై 24 : కరక, సాలిక మల్లవరం, ఆరిలోవ రంగురాళ్ల క్వారీలపై నిరంతర నిఘా పెట్టామని రేంజ్ అధికారి లక్ష్మీనర్సు తెలిపారు. బుధవారం ఆయన సిబ్బందితో కరక రంగురాళ్ల క్వారీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాల నేపథ్యంలో వర్షాలు పడుతున్నప్పుడు రంగురాళ్ల తవ్వకాలు జరపకుండా 24 గంటలు పహారా ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదుగురు సిబ్బందితో కరక రంగురాళ్ల కొండ మీద బేస్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఇద్దరు సిబ్బందితో రాత్రి పెట్రోలింగ్‌కు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వన్య ప్రాణులను వేటాడినా, మాంసంతో దొరికినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నరాసపల్లి, పందూరు,ఎరకన్నపాలెంలో నిఘా పెట్టామని ఆయన చెప్పారు.

క్రైం... crime news

నమ్మకంగా పనిచేస్తున్నట్టు నటించి రూ.4 కోట్లు స్వాహా

- యజమాని అకౌంట్ నుంచి తన అకౌంట్‌కు నగదు బదిలీ చేసుకున్న ప్రబుద్ధుడు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ, ఆడిట్ బాధ్యతలను అప్పగిస్తే ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేశాడు. అనారోగ్యం నుంచి కోలుకున్న యజమాని మోసాన్ని గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదుచేశారు. నిందితుడు పరారీలో ఉండడం తో ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. దీనికి సంబంధించిన ఫిర్యాదుదారుడు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి...బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీలోని తన ఇంటి నుంచే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేవారు. ఈ క్రమంలో తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్‌కు సంబంధించిన వ్యవహారాలు, ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయడం వంటి పనులు చక్కబెట్టేందుకు నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తికి 2016లో గుండె సంబంధిత సమస్య తలెత్తడంతో వైద్యం నిమిత్తం గుంటూరు వెళ్లారు. కోలుకుని తిరిగి విశాఖ రావాలనుకుంటున్న సమయంలో కంటి చూపుతోపాటు మరికొన్ని ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో తన కుమార్తెకు వ్యాపార వ్యవహారాలు అప్పగించారు. ఆమె తరచూ నగరానికి రాలేకపోవడంతో గోవింద్ ద్వారానే వ్యాపారాన్ని సాగించేవా రు. కొన్నాళ్ల కిందట స్టోన్ క్రషర్‌ను రూ.3.36 కోట్లకు విక్రయించేయడంతో ఆ మొత్తాన్ని రాధాకృష్ణమూర్తి బ్యాంకు ఖాతాలో కొంత, ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మరికొం త ఉంచారు. దీంతోపాటు మరో రూ.64 లక్షలు విలువై న డిపాజిట్లు రాధాకృష్ణమూర్తి పేరుతో ఉన్నాయి. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం పాలవ్వడం, ఆయన కుమార్తె పూర్తిస్థాయిలో వ్యాపారంపై దృష్టిపెట్టలేకపోవడాన్ని గోవింద్ అవకాశంగా తీసుకున్నాడు. తన పేరుతో ఒక సేవింగ్ అకౌంట్, రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పా టుచేసి కరెంట్ అకౌంట్ ఒకటి ఓపెన్ చేశాడు. రాధాకృష్ణమూర్తి అకౌంట్‌లోని నగదుతోపాటు ఫోర్జరీ చెక్ లతో రామకృష్ణమూర్తి పేరిట ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల ను దశల వారీగా తన బ్యాంకు ఖాతాలకు, స్నేహితు లు, కుటుంబసభ్యుల ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. రాధాకృష్ణమూర్తి ఈ విషయాన్ని గుర్తించకపోయారు. ఇదిలావుండగా ఈ ఏడాది ఏప్రిల్ 14న పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ నుంచి రాధాకృష్ణమూర్తికి ఫోన్ వచ్చింది. అకౌంటెంట్ చిటికెల గోవింద్ కనిపించడం లేదని అతని భార్య ఫిర్యాదు చేసిందని చెప్పడంతో ఆయన అవాక్కయ్యారు. వెంటనే అనుమానంతో నగరానికి వచ్చి తన బ్యాంకు అకౌంట్లలోని నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాల గురించి అధికారులను ఆరా తీశారు. నగదు గోవింద్ పేరుతో ఉన్న అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను చెక్ ద్వారా దశల వారీగా విత్‌డ్రా చేసుకున్నట్టు బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో గోవింద్ తనను మోసం చేసినట్టు గుర్తించిన రాధాకృష్ణమూర్తి అదే నెల 24న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. గోవింద్ కోసం పోలీసులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో కేసు దర్యాప్తు ఆగిపోయింది. ఈలోగా రామకృష్ణమూర్తి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో చేరారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలంటూ రాధాకృష్ణమూర్తి కుటుంబసభ్యులు ఈనెల 21న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చిని కలిసి విజ్ఞప్తిచేశారు. దీనిపై స్పందించిన సీపీ నిందితుడి ఆచూకీని కనిపెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, ప్రత్యేక బృందాలతో గాలించాలని ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ సంజీవరావును ఆదేశించారు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో పరారీలో ఉన్న గోవింద్ కోసం గాలింపు మొదలుపెట్టారు.

సైబర్ నేరస్థుడి అతి తెలివి

- అనకాపల్లికి చెందిన వ్యక్తి అకౌంట్ నుంచి మరో ఖాతాకు రూ.2.81 లక్షలు బదిలీ
- పనిచేయని సిమ్‌ను బ్లాక్ చేసి మరీ మోసం
- కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు

అనకాపల్లి టౌన్, జూలై 24 : పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంక్ అకౌంట్ నుంచి వేరొక బ్యాంక్ ఖాతాకు గుర్తుతెలియని వ్యక్తి రూ.2.81 లక్షలు బదిలీ చేసిన సంఘటనపై బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌కు చెందిన మళ్ల వెంకటగిరిధర్ సెల్‌ఫోన్ సిమ్ గత నెల 14వ తేదీ నుంచి పనిచేయడం లేదు. గుర్తు తెలియని వ్యక్తి తన తెలివితేటలతో సిమ్‌ను బ్లాక్ చేసి, ఫిర్యాదు పేరు మీదే కొత్త సిమ్‌ను వేసి గత నెల 16వ తేదీన ఒక బ్యాంక్ నుంచి నగదును వేరొక అకౌంట్‌కు మళ్లించాడు. ఆ మర్నాడు బాధితుడు కొత్త సిమ్‌ను వేసి బ్యాంక్ అకౌంట్ చూడగా, అందులో నగదు వేరొక అకౌంట్‌కు బదలాయించినట్టు గుర్తించాడు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీ

నక్కపల్లి, జూలై 24 : మండల కేంద్రం నక్కపల్లిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలివి. వీవర్స్ కాలనీకి చెందిన కోమాకుల సత్యనారాయణ తన భార్యతో కలిసి మూడు రోజుల కిందట జోగంపేటలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ తన ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండడాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో భద్రపర్చిన రెండు బంగారు తాళ్లు, ఉంగరాలు, చైన్లు వంటి ఆభరణాలు మొత్తం ఏడు తులాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సాయంత్రం చోరీ జరిగిన ఇంటిని సీఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎస్.రాయవరం, జూలై 24 : మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న కారు ధర్మవరం అగ్రహారం వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నప్పటికీ అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



ధర్మవరం అగ్రహారం వద్ద బోల్తా పడిన కారు

గంజాయి కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

కొత్తూరు/లంకెలపాలెం, జూలై 24 : అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన నీలకాయల మోహన్‌కు గంజాయి కేసులో నాలుగు సంవత్సరాల ఐదునెలల కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానాను కోర్టు విధించినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక బుధవారం తెలిపారు. 2020 జనవరి 24న పరవాడ పోలీసు స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ గోపి తన సిబ్బందితో కలిసి లంకెలపాలెం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారన్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బ్యాగ్‌తో ఉన్న వ్యక్తి తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారన్నారు. దీంతో ఆ బ్యాగులో తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి పట్టుబడినట్టు చెప్పారు. దీనిపై విచారణ పూర్తి చేసిన అనంతరం 10వ అదనపు జడ్జి కోర్టులో జడ్జి నందనవనం శ్రీవిద్య ముద్దాయి మోహన్‌కు బుధవారం పై విధంగా శిక్ష విధించినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

సమస్యల సుడిలో మెట్టపాలెం వసతి గృహం

శిథిలావస్థకు చేరిన భవనం

- సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన హాల్‌లోనే ఉంటున్న 60 మంది విద్యార్థినులు
- చాలీచాలని వసతులతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పైకప్పు నుంచి పెచ్చులూడి బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు

పరవాడ, జూలై 24: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో గల మెట్టపాలెం ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది.. ఇక్కడ మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 60 మంది బాలికలు ఉన్నారు. భవనం దుస్థితిని చూసి వారంతా భయం భయంగా గడుపుతున్నారు. భవనం శ్లాబు నుంచి పెద్ద పెద్ద పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ శిథిల భవనాన్ని వదిలేసి పక్కనే సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో ఒక గది (హాల్) నిర్మించింది. అందులో విద్యార్థులు ఉంటూ నెట్టుకొస్తున్నారు. అది ఏ మాత్రం సరిపోవడం లేదని వారంతా చెబుతున్నారు. పాత భవనం తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించేందుకు గతంలోనే ఇంజినీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. ఇప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. ప్రస్తుతం భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శ్లాబు, సన్‌షేడ్, పిల్లర్స్ నుంచి పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. భవనంలోని పలు గదులు వర్షానికి కారిపోతున్నాయి. కిటికీలు ఊడిపోయాయి. వంటగది ప్రమాదకరంగా మారడంతో రేకుల షెడ్డులో నెట్టుకొస్తున్నారు. సింహాద్రి యాజమాన్యం నిర్మించిన ఒక్క గదిలోనే వార్డెన్‌తో పాటు 60 మంది బాలికలు ఉంటున్నారు. ఇది ఏ మాత్రం వారికి సరిపోవడం లేదు. ఇరుకు గదిలోనే తప్పనిసరిగా ఉండాల్సి వస్తుంది. విద్యార్థినులకు చెందిన సామగ్రిని ఉంచుకోవడంతో పాటు అందులోనే చదువుకోవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు ఉన్నప్పటికీ స్థలం సరిపోకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. గత్యంతరం లేక నేల మీదే పడుకుంటున్నారు. ఇక్కడ మరుగుదొడ్లకు, బాత్‌రూములకు రన్నింగ్ వాటర్ సౌకర్యం లేదు. మోటారు వద్ద ఉన్న ట్యాంక్ నుంచి నీటిని బకెట్లతో పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే వసతి గృహంలో గల మినీ మినరల్ ట్యాంక్ మూలకు చేరింది. దీనికి మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో కుళాయిలు, మోటార్ల ద్వారా వచ్చే నీటిని తాగుతున్నారు. వసతి గృహంలో సమస్యల కారణంగా విద్యార్థినుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



సన్‌షేడ్ దెబ్బతినడంతో...



శిథిలమైన భవనం పిల్లర్ అడుగు భాగం



శిథిలావస్థలో ఉన్న మెట్టపాలెం బీసీ బాలికల వసతిగృహం

కల్యాణపు లోవకు కొనసాగుతున్న వరద ప్రవాహం

- రెండు గేట్లు తెరిచి 100 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, జూలై 24 : మండలంలో కల్యాణపు లోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి వంద క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నామని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయ సామర్థ్యం 460 అడుగులు కాగా, బుధవారం నాటికి 459.10 అడుగుల వరకు నీటి మట్టం చేరిందన్నారు. ఈ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో ఎగువన విస్తరంగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 75 క్యూసెక్కుల మేర జలాశయంలోకి వస్తుండంతో రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతూ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి విడిచిపెడుతూ నీటి మట్టాన్ని స్థిరీకరిస్తున్నామని ఏఈ తెలిపారు. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నందున ఈ నెల 15 నుంచి ఇంతవరకూ జలాశయంలో వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఐదుసార్లు గేట్లు ఎత్తినట్టు చెప్పారు. మంగళవారం ఉదయం నీటి మట్టం తగ్గడంతో ఎత్తిన గేట్లు క్లోజ్ చేయగా జలాశయ ఎగువన కురుస్తున్న వర్షాలకు మళ్లీ బుధవారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర నీటిని విడిచి పెడుతున్నామన్నారు. సర్పానది పరీవాహక మూడు మండలాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తిన కారణంగా సర్పానదిలో నీటి ప్రవాహం బాగా పెరుగుతుందన్నారు. అందుకే నదిని దాటి వెళ్లే ప్రయత్నాలు వంటివి చేయవద్దని ఏఈ సూచించారు.



కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి నీరు విడిచి పెడుతున్న దృశ్యం

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

- ప్రధాన కార్యాలయంలో ప్రతి విభాగం పరిశీలన
- మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం
- 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?'... అంటూ కార్యాలయం ఇన్‌చార్జిపై అసహనం
- ముఖ్యమైన ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులకు ఆదేశం
- ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచన

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్ బుధవారం కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు వినియోగించే మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యాలయం ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వరరావును పిలిచి 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?' అని ప్రశ్నించారు. కార్యాలయ ఆవరణతోపాటు మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంలో కారిడార్‌కు ఇరువైపులా ఇనుప బీరువాల్లో ఫైళ్లను ఉంచడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫైళ్లను ఎవరైనా తస్కరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమైన, అవసరమైన ఫైళ్లను కార్యాలయంలోనే భద్రపరిచి, మిగిలిన ఫైళ్లను జోన్-4 కార్యాలయానికి తరలించి కారిడార్‌ను ఖాళీ చేయాలని సూచించారు. కార్యాలయంలోకి గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది పనిచేసేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఖాళీ ప్రదేశాల్లో మంచి నీడను ఇచ్చే మొక్కలను నాటాలని హార్టికల్చర్ డీడీ దామోదర్‌కు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు కల్పించడంతోపాటు, వారి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర సమాచారాన్ని నగర ప్రజలకు తక్షణం చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిపాలన, యూసీడీ విభాగంతోపాటు అకౌంట్స్, ఐటీ విభాగాలను కమిషనర్ పరిశీలించారు. తాను మరోసారి తనిఖీ చేస్తానని అప్పటికి పరిస్థితులన్నీ మెరుగుపడాల్సిందేనని స్పష్టంచేశారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్‌వర్మ, ఎస్ఈలు, వేణుగోపాల్, వినయ్‌కుమార్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు

గొలుగొండ, జూలై 24 : సంచిలో రెండు కిలోల గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. బుధవారం మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కాలినడకన వెళుతున్న బాలుడి సంచి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ సభ్యత్వాలను తీసుకోవాలి

- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బాబూరావు

కె.కోటపాడు, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ అసోసియేషన్ సభ్యత్వాలను తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బాబూరావు కోరారు. అసోసియేషన్ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం ఆయన స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులను కలిసి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా సబ్-రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కె.కోటపాడు తాలుకా ఎన్నికలు ఈ నెల 29న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ, సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న బాబూరావు తదితరులు

అప్పన్నను దర్శించుకున్న అమరావతి రైతులు



దేవస్థానం ఎదుట రైతులు

సింహాచలం, జూలై 24 : వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాత్రి అమరావతి ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది రైతులు దర్శించుకున్నారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు విజయం సాధించి, ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నామని, అది తీర్చుకునేందుకు స్వామివారిని దర్శించుకున్నట్టు వారు తెలిపారు. గురువారం ఉదయం అరసవల్లిలో సూర్యనారాయణస్వామిని దర్శించుకుని ఆలయ ఆవరణలో 108 సార్లు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం చేయనున్నట్టు చెప్పారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో గాలం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు టోకరా
- రూ.22 లక్షలు దోచేసిన కిలాడీ లేడీ
- హైదరాబాద్‌కు చెందిన యువతిగా గుర్తింపు
- అరెస్టు చేసి రిమాండుకు తరలించిన సైబర్‌క్రైమ్ పోలీసులు

ఎండాడ, జూలై 24 : ఫేక్ అకౌంట్‌తో ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి ఓ కిలాడీ లేడీ ఏకంగా రూ.22 లక్షలు దోచేసింది. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. సైబర్‌క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ తెలిపిన వివరాల మేరకు...

హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియ అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసింది. మ్యాట్రిమోనీ సైట్లలో రిజిస్టర్ చేసుకున్న యువకుల వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో వారితో పరిచయం పెంచుకునేది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారి నుంచి డబ్బులు గుంజేది. ఈ క్రమంలో విశాఖ నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుంది. అతని వాట్సాప్ నంబరును సేకరించి, అందమైన అమ్మాయిల ఫొటో పంపి చాటింగ్ చేసింది. అతడి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, ఎమోషనల్‌గా దగ్గర అయినట్టు నటించింది. డబ్బులు అత్యవసరమంటూ అతని నుంచి రూ.22 లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకుంది. ఆ తరువాత ఆమె ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోవడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియగా గుర్తించి, ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

పీఏసీఎస్ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాం

- నిధుల దుర్వినియోగం అయినట్టు నిర్ధారణ అయితే తదుపరి చర్యలు
- జిల్లా సహకార అధికారి స్వరూపరాణి



జానకిరామపురం పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, జూలై 24 : జానకిరామపురం పీఏసీఎస్‌లో సీఈవో నిధులు దుర్వినియోగం వాస్తవమని నిర్ధారణ అయితే తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార శాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొనారు. ఈ నెల 22న 'పీఏసీఎస్‌లో రూ.2 కోట్లు గోల్‌మాల్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. పీఏసీఎస్‌లో నిధులు దుర్వినియోగంపై సమాచార శాఖ ఏడీకి, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. ఈ ఏడాది మే 14న జానకిరామపురం పీఏసీఎస్‌లో నిధులు దుర్వినయోగంపై డీసీసీబీ సీఈవో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎలమంచిలి డీఎల్‌సీవో ఈనెల 10న అసిస్టెంట్ రిజిస్టర్ ఎస్.సత్యనారాయణతో ప్రాథమిక విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఈ నెల 11న ఎలమంచిలి డీఎల్‌సీవోకు నివేదికను అందజేశారని పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా సెక్షన్ 52 విచారణకు ఈ నెల 19న అసిస్టెంట్ రిజిస్టర్ ఐవీ రమణమూర్తిని నియమించడం జరిగిందని తెలిపారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ అయితే సీఈవోపై తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

27న ప్రభుత్వ ఐటీఐలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

పాయకరావుపేట, జూలై 24 : ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రెండో విడత అడ్మిషన్ల కొరకు ఈనెల 27వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల వద్ద హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

26న తాండవ నీరు విడుదలపై సమావేశం

నాతవరం, జూలై 24 : ఈ నెల 26న తాండవ నీరు విడుదలపై తాండవ ఆయకట్టు రైతులతో నాతవరం తాండవ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు డీఈ అనురాధ తెలిపారు. ఖరీఫ్‌కు నీరు ఎప్పుడు విడుదల చేస్తే బాగుటుందన్న విషయమై తాండవ ఆయకట్టు రైతులు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకొని వారి అభీష్టం మేరకు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- అల్లూరి యువజన సంఘ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు



వీరభద్రరావు

నర్సీపట్నం అర్బన్ జూలై 24 : నర్సీపట్నంలో గల కవర్డ్, ఫైటర్ల సమాధుల స్థలాన్ని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్టు అల్లూరి యువజన సంఘ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నంలో బ్రిటీష్ సేనానులు కవర్డ్, ఫైటర్ల సమాధులు అల్లూరి సాక్ష్యంగా నిలిచి నర్సీపట్నంలో ప్రధాన రహదారి పక్కన యాభై సెంట్లు స్థలం ఉందన్నారు. ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తే గోడ నిర్మాణానికి అల్లూరి యువజన సంఘం ముందుకు వస్తుందన్నారు.

రైళ్లు మళ్లింపు, గమ్యం కుదింపు

విశాఖపట్నం, జూలై 24: పూణే డివిజన్‌లో ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో లోకమాన్య తిలక్ టెర్మినస్ నుంచి విశాఖ వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520) ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు వయా మిరాజ్, కుర్దువాడి మీదుగా నడుస్తుందని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, భువనేశ్వర్-పూణే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22882) ఈనెల 30న భువనేశ్వర్ నుంచి సోలాపూర్ వరకు, తిరుగు ప్రయాణంలోని పూణే - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22881) ఆగస్టు ఒకటో తేదీన సోలాపూర్‌లో బయలుదేరి భువనేశ్వర్ చేరుతుందని తెలిపారు. సోలాపూర్, పూణే మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు వివరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియమకానికి ఇంటర్వ్యూలు రేపు

ఎలమంచిలి, జూలై 24 : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి సంబంధించి ఈనెల 26వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కెమిస్ట్రీలో పీజీ కోర్సులు బోధించేందుకు ఇద్దరు అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ యూజీ కోర్స్ బోధించేందుకు ఇద్దరు అధ్యాపకులు అవసరంగా పేర్కొన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ లేదా ఎంసీఏలో 55 శాతం మార్కులు పొంది నెట్ లేదా పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో శుక్రవారం కళాశాలలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఈవీఎంల భద్రతలో జాగ్రత్తలు పాటించాలి

▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ఈవీఎంలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, జూలై 24 : అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయం పక్కన గల ఈవీఎంలను భద్రపర్చే గదిని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రతా పరమైన అంశాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాచీన క్రీడలకు ప్రోత్సాహం అందరి బాధ్యత'



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ



ఆకట్టుకున్న విద్యార్థినుల విన్యాసాలు

లంకెలపాలెం, జూలై 24 : మరుగున పడిన ప్రాచీన క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. శిక్షా సప్తహ క్రీడా వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాచీన క్రీడలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఆమె ప్రాచీన క్రీడలైన బచ్చాట, ఏడు పెంకులాట, ఒంగుదూకుళ్ళు, అష్టాచమ్మా, బొంగరాలాట, కర్రాబిళ్లా, వైకుంఠపాళీ, గోలిలాట, క్యారమ్స్‌తో పాటు యోగా, పిరమిడ్ విన్యాసాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీ పట్నాయక్, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి నారుమడులు నీళ్లపాలు

... 5వ పేజీ తరువాయి

జి.మోహన్‌రావు తెలిపారు. ఆర్‌జీఎల్ 2537 వరి విత్తనాలు 316 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 19 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 2.5 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 10 క్వింటాళ్ల విత్తనాల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఇండెంట్ పంపామన్నారు. విత్తనాలు రాగానే రైతులకు అందజేసి మళ్లీ నారు మడులు, లేదా ఎద పద్ధతిలో సాగు చేసుకొనేందుకు ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా..

... 5వ పేజీ తరువాయి

కల్పించామన్నారు. నర్సింగ్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ట్యూటర్ గ్రేడ్-1 పోస్టుకు కొద్ది రోజుల్లో ప్రమోషన్ కల్పించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీహెచ్‌ఈవో), పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్‌ఎన్) నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)గా పదోన్నతులు కల్పించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సిద్ధమవుతోందన్నారు. ఈ మేరకు జోన్-1 పరిధిలో పదోన్నతులకు సంబంధించి 40 వరకు ఖాళీలున్నట్టు గుర్తించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సమాచారాన్ని అందించా మన్నారు. ఆయా కేడర్లలో పదోన్నతులు పొందేందుకు అర్హులైన సీనియర్ జాబితాను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని పాటించాలని ఆదేశించినట్టు వెల్లడించారు.

సొసైటీల నెత్తిన గోదాముల భారం

... 5వ పేజీ తరువాయి

సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి (నామినేటెడ్ పదవి) పదవి తీయిస్తానని బెదిరింపులకు పాల్పడేవారని తాజాగా వాపోతున్నారు. చివరకు డీసీసీబీ, జిల్లా సహకారశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆగమేఘాలపై బిల్లులుఅప్‌లోడ్ చేసుకునేవారని చెబుతున్నారు.

నిరుపయోగంగా గోదాములు

ఇదిలావుండగా నాగులాపల్లి, నాతవరం మినహా మిగిలిన ఏడుచోట్ల గోదాములు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇప్పటివరకు పూర్తయిన గోదాములకు తాళాలు వేసి ఉంచడం మినహా వినియోగంలోకి తీసుకురాలేదు. కశింకోట మండలం జమాదులపాలెంలో నిర్మించిన గోదాముకు వెళ్లే రోడ్డులో కనీసం కారు కూడా వెళ్లదని, ఇక లారీల్లో ఆహార ధాన్యాలు తరలించేందుకు అవకాశంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళితే గ్రామం బయటి నుంచి రోడ్డు నిర్మించాలని సూచించారట. బుచ్చెయ్యపేటలో గోదాము పైకప్పుగా వేసిన సిమెంట్ రేకుల నుంచి వర్షం నీరు కారిపోతోందని స్థానికులు తెలిపారు. గోదాములు అవసరం లేకున్నా బలవంతంగా ఒప్పించి, నాబార్డు రుణం తీసుకువచ్చి సొసైటీలపై మోయలేని భారం మోపారని ఓ సొసైటీ ప్రతినిధి వాపోతున్నారు. ప్రస్తుతం నిర్మించిన తొమ్మిదింటిలో రెండు మినహా మిగిలిన గోదాములు ఎందుకూ ఉపయోగపడవని, అక్కడ ఆహార ధాన్యాలు నిల్వచేస్తే కాపలాగా షిఫ్ట్‌కు ఇద్దరు ముగ్గురు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని, పైగా నాసిరకం నిర్మాణాలలో నిల్వలు తడిసిపోతాయని వివరించారు. ఈ నేపథ్యంలో గోదాముల నాణ్యతపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపిస్తే లోపాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దారులు.. దారుణం

▸ పల్లె నుంచి పట్టణం వరకు ఇదే దుస్థితి

▸ వైసీపీ ఐదేళ్ల పాలనలో కన్నెత్తి చూడని పాలకులు

▸ వర్షాలతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనం

▸ కొత్త ప్రభుత్వమైనా మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



సబ్బవరం : జోడుగుళ్లు- అమృతపురం రోడ్డు గండివాని కొంపలు వద్ద దుస్థితి



ఎలమంచిలి మునిసిపాలిటీ శేషుకొండ సమీపంలో అత్యంత దారుణంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్డు

పరవాడ, జూలై 24 : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్ నుంచి బొట్టవానిపాలెం వరకు రహదారి దారుణంగా తయారైంది. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గాజువాక నుంచి ఎలమంచిలికి వెళ్లే ప్రధాన రహదారిలోని ఈ గుంతల్లో నీరు చేరుతుండడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు కారణంగా గోతులను గమనించని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్, గాజువాక, స్టీల్‌ప్లాంట్, ఎలమంచిలి తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా ఈ రహదారి గుండా ప్రయాణిస్తారు. దీనికితోడు సెజ్‌కు వెళ్లే భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం గల ఈ రహదారిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గోతులమయంగా మారింది. సినిమాహాల్ జంక్షన్ నుంచి బొట్టవానిపాలెం మధ్య ఈ రహదారిలో అడుగుకో గుంత దర్శనమిస్తుంది. కనీసం గుంతలను పూడ్చే చర్యలు చేపట్టకపోవడంతో అవస్థలు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

గజానికో గొయ్యి

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్ల నుంచి అమృతపురం వెళ్లే రహదారి సుమారు కిలోమీటరు మేర అధ్వానంగా మారింది. గండివారి కొంపలు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురికావడంతో మురుగు నీటితో పాటు వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఈ రోడ్డు ఇరువైపులా అంచులు కోతకు గురికావడం వల్ల తరచూ చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నట్టు చెపుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

అడుగు తీసి.. అడుగు వేసేదెలా..!

ఎలమంచిలి : జగనన్న కాలనీల్లో పరిస్థితులు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలుస్తున్నాయి. ఈ కాలనీల పేరిట సదరు పాలకులు హడావుడి చేయడమే తప్ప, కల్పించిన సౌకర్యాలు ఏమీ లేవని పలువురు ఇళ్ల లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి శేషుకొండ సమీపంలో నిర్మాణాలను చూపుతున్నారు. ఇక్కడ జగనన్న లే అవుట్‌లో మొత్తం 219 మందికి స్థలాలను మంజూరు చేశారు. కానీ అంతర్గత రోడ్లు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతం అంతా గోతులమయంగా మారింది. దీంతో అక్కడ ఇళ్లు నిర్మించుకున్నవారు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికితోడు తుఫాన్ కారణంగా తాజాగా కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతం అంతా మురదమయంగా మారింది. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా పలువురు పాదచారులు, వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవవున్నారు. వైసీపీ పాలకులు హడావుడిగా ఇళ్ల స్థలాలను ఇచ్చి చేతులు దులిపేసుకున్నారే తప్ప, ఇక్కడ నివాసం ఉండాలంటే కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించకపోవడం దారుణమని వాపోతున్నారు.

రోడ్డుపైనే మురుగు, వర్షపు నీరు

పాయకరావుపేట రూరల్ : మండలంలోని మంగవరంలో పలు వీధిరోడ్లు అధ్వానంగా మారాయి. వర్షం కురిస్తే చాలు రోజుల తరబడి నీరు తగ్గకపోవడంతో మురుగుగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెపుతున్నారు. తొమ్మిదో వార్డు వాటర్ టాంకు వీధిలో వర్షం కురిస్తే చాలు నెల రోజుల వరకు నీరు నిలిచిపోతుందని అంటున్నారు. ఈ కారణంగా ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. వీధిలో కొంత మంది తమ ఇళ్ల వద్ద రోడ్డుపై గ్రావెల్ వేసుకోవడంతో నీరు నిలిచిపోతుందని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఎంపీపీ పాఠశాలకు ఎదురుగా ఉన్న వీధిలోనూ నీరు నిలిచిపోతుందని చెపుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



పరవాడ : సినిమాహాల్ జంక్షన్ సమీపంలోని సర్వీసింగ్ సెంటర్ వద్ద...



పాయకరావుపేట రూరల్ : మంగవరంలో వాటర్ ట్యాంకు ఎదురుగా...

ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్లకు 'బెస్టాఫ్ లక్'



విద్యార్థులతో క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు


తుమ్మపాల, జూలై 24 : ఒలింపిక్స్‌లో ఇండియా తరపున తలపడుతున్న క్రీడాకారులు పతకాలు సాధించాలని నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి ఆకాంక్షించారు. బుధవారం ఇక్కడి రైతు భారతిలో పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు, విద్యార్థినీ, విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఒలింపిక్స్‌లో 16 రకాల క్రీడల్లో 117 మంది భారత క్రీడాకారులు తలపడనున్నారన్నారు. వీరంతా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ క్రీడా అసోసియేషన్ల ప్రతినిధులు అమరపల్లి కృష్ణాజీ, కర్రి అప్పాజీ, గుండ్రపు నీలా, పీఎస్‌కే నాయుడు, ఆళ్ల ప్రవీణ్, మద్దాల సురేష్, దేముడు, దాడి శ్యామ్, కె.నాయుడు, రాజనాల పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వుషూ పోటీలకు ముగ్గురు ఎంపిక


పరవాడ : తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈనెల 26 నుంచి 31 వరకు నిర్వహించనున్న 23వ జూనియర్ నేషనల్ వుషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఇక్కడి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 28న రాష్ట్ర వుషూ సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన రాహుల్‌మిస్త్రీ, పి.అభినవ్, క్రిస్ దేవనీలు సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారని పాఠశాల కోచ్ డైరెక్టర్ మధుబాబు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో పెదగుమ్ములూరుకు పతకాలు

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కిల్లాడ హిమబిందు, కిల్లాడ నాగాంజలి అనే విద్యార్థినులు ఇద్దరూ ఇటీవల గుంటూరు జిల్లా రేపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో వీరిని హెచ్‌ఎం సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మలతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు



పెదగుమ్ములూరులో పతకాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందన



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తదితరులు

బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన దుగ్గునాయుడు

కోటవురట్ల, జూలై 24 : మండలంలోని కైలాసపట్నం నుంచి రాజుపేట వెళ్లే రోడ్డులో గల మలుపు వద్ద బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. రామచంద్రపురం నుంచి ఓ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు కోటవురట్ల వస్తుండగా, ఎదురుగా నర్సీపట్నం నుంచి రాజుపేట గ్రామానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తున్నారు. కైలాసపట్నం- రాజుపేట రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి ఈ రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పైల జానీకి తలకు బలమైన గాయం కావడంతో వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు అతనిని కేజీహెచ్‌కు పంపారు. అలాగే, గాయపడిన మరో వ్యక్తి భీశెట్టి దుగ్గునాయుడు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. కోటవురట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం, జూలై 24 : సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్‌ఎస్‌వీ శక్తిప్రియ, డాక్టర్ ఎన్.వాసంతిలు వ్యాధులకు గురికాకుండా పల్లెవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే, ఎస్.రాయవరంలో ఫీవర్, డయేరియా సర్వేలను పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డు పనులకు ఏర్పాట్లు

నక్కపల్లి, జూలై 24 : ఇక్కడి రాజీవ్‌నగర్ కాలనీలో సరైన రహదారి సదుపాయం లేక వర్షంపడితే నివాసితులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మేరకు కాలనీ వాసులు ఇటీవలకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం పంచాయతీరాజ్ అధికారులు నరేంద్ర, వెంకటేశ్ రాజీవ్‌నగర్ కాలనీని సందర్శించి కొలతలు తీశారు. త్వరలో ఈ పనులు చేపడతామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు, నానిబాబు, స్వామి,అప్పన్న, నాగు, రవి పాల్గొన్నారు.

విఘ్నేశ్వర ఆలయంలో సంకటహర చతుర్థి



నక్కపల్లి, జూలై 24 : మండల కేంద్రం నక్కపల్లిలోని వీవర్స్‌కాలనీలో ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకులు శేషాచార్యులు, అప్పలాచార్యులు స్వామివారి పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేపట్టారు.

ఇంటి పన్నులు శతశాతం వసూలు చేయాలి

పరవాడ, జూలై 24 : పంచాయతీల్లో శతశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు సూచించారు. బుధవారం కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటి పన్నుల వసూళ్లలో అలసత్వం వహించరాదన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాల, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం రేపు

కొత్తూరు, జూలై 24 : కశింకోట, కొత్తూరు సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఎస్‌ఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, సంపతిపురం, వేటజంగాలపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

తుమ్మపాల, జూలై 24 : అనకాపల్లి మండలంలోని కోడూరు, గొలగాం గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై బుధవారంఅవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ కొత్త చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం అందజేత

నక్కపల్లి, జూలై 24 : కాగిత గ్రామానికి చెందిన జనసైనికుడి కుటుంబానికి పార్టీ అధిష్ఠానం ఆర్థిక సాయమందించింది. ఈ గ్రామానికి చెందిన రామసూరి గతంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. ఇటీవల ఆయన బైక్‌పై నుంచి పడిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ ఖర్చుల నిమిత్తం జనసేన కార్యాలయం అతనికి రూ.24వేలు ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈమేరకు చెక్కును నియోజకవర్గం నాయకులు గెడ్డం బుజ్జి బాధిత కుటుంబానికి అందజేశారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, జగ్గన్నదొర, కనకేశ్వరరావు, యర్రంశెట్టి సుభాష్, రామకృష్ణ, తుమ్మల శ్యాం కిశోర్ పాల్గొన్నారు.

నునపర్తిలో వివాదాస్పద భూమి సర్వే



పోలీసు బందోబస్తు నడుమ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జూలై 19 : నునపర్తిలో వివాదాస్పద భూమికి పోలీసుల పహారా నడుమ రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో గల భూమిలో నునపర్తికి చెందిన సుమారు. 40మంది రజకులు వంశపారంపర్యగా బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నారు. వీరు వినియోగిస్తున్న సదరు స్థలం తమకు చెందినదని గ్రామంలో ఓ రైతు ఇటీవల రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. దీంతో అధికారులు గతంలో సర్వే నిమిత్తం రాగా రజకులు అడ్డుకున్నారు. సర్వే నంబరు 1/5సిలో సుమారు రెండున్నర ఎకరాలు భూమికి 1977 నవంబరులో తమ బంధువులకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, ఇప్పుడు తాము స్వాధీనం చేసుకుంటుంటే రజకులు అడ్డుకుంటున్నారని పట్టాదారు బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా ముత్తాతల నుంచి బట్టలు ఉతుకుతు జీవిస్తున్నామని, ఇప్పుడు పట్టాఉందంటూ వస్తే ఎలా.. అని రజకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే చేసేందుకు రాగా, ముందస్తు జాగ్రత్తగా సిబ్బందిని పంపామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

'బాల్య వివాహాల వల్ల అనర్థాలు'

ఎలమంచిలి, జూలై 24 : బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలపై పేట బయ్యవరం పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె.అమ్మాజీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమన్నారు. ఇటువంటి వాటిని అరికట్టడంతో పాటు నిరక్షరాస్యులపై ఆయా తల్లిదండ్రును చైతన్యపర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హెచ్‌ఎం బొడ్డేడ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిననాలుగు రోడ్ల జంక్షన్‌లో కలవరపెడుతున్న కల్వర్టు

▸ నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై రంధ్రం

▸ పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


▸ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



చిననాలుగు రోడ్ల జంక్షన్‌లో దెబ్బతిన్న కల్వర్టు

అనకాపల్లి టౌన్, జూలై 24 : ఇక్కడి మెయిన్ రోడ్డులో గల చిననాలుగు రోడ్ల జంక్షన్‌లో కల్వర్టుపై రంధ్రం పడింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణవాసులతో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలతో నిత్యం ఈ జంక్షన్ సందడిగా ఉంటుంది. ఇటువంటి ప్రదేశంలో రోడ్డుకు మధ్యలో గతంలో జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన కల్వర్టుకు రంధ్రం పడినా పటించుకునేవారు కరువయ్యారు. వాహనదారులు సమీపంలోకి వచ్చేవరకు దీనిని గుర్తించలేకపోతున్నారు. పగలు ఎలా ఉన్నా రాత్రివేళ ఇక్కడ చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయ పితామహుడికి నివాళి



అనకాపల్లి గ్రంథాలయంలో వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళి

అనకాపల్లి టౌన్, జూలై 24 : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఇక్కడి శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది జి.రామ్‌జీకిరణ్, నూకరత్నంలతో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

కశింకోట : తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాల పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని జరిపారు. గ్రంథాలయాధికారి జగన్నాథం, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నక్కపల్లి: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్ధన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అప్పలరాజు, పాలూరి బుల్లి వెంకట్రావ్, సిబ్బంది వి.రమణమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా శిక్షా సప్తాహ్



పాయకరావుపేట : కేహెచ్‌వాడ పాఠశాలలో ఆటల పోటీలు

పాయకరావుపేట, జూలై 24 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం శిక్షా సప్తాహ్ విద్యా ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పాయకరావుపేట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ కేఎన్ గాంధీ, ఆయా విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: చినదొడ్డిగల్లు పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం స్పోర్ట్స్‌డే సందర్భంగా పిల్లలకు పలు విభాగాలకు చెందిన ఆటల పోటీలు హెచ్‌ఎం కవిత, పీఈటీ ఆదిలక్ష్మి, రవీంద్రనాధ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు యేడిద వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోటవురట్ల: శిక్ష సప్తాహ్ విద్యావారోత్సవాలల్లో భాగంగా మండలంలోని కొడవటిపూడి యూపీ స్కూల్, పాములవాక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం కాస్ట్ అండ్ నోకాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బోధనఅభ్యసన సామగ్రి ప్రదర్శన నిర్వహించారు. పాములవాక స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, కొడవటిపూడి పాఠశాల హెచ్‌ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొడటిపూడి సర్పంచ్ కొసూరి అప్పారావు, ఎంపీటీసీ ఎలమించిలి ప్రకాష్, వేచలపు బాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేచ్చలపు బాస్కరరావు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం : ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, జూలై 24 : ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం ఇచ్చే పండ్లతోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి వీఆర్పీలకు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో సియ్యాద్రి నాగరాజు మాట్లాడుతూ చీడికాడ మండలంలో పండ్లతోటల పెంపకం 150 ఎకరాల్లో చేయాలన్నది లక్ష్యం కాగా, ఇంతవరకూ 110 ఎకరాల్లో పండ్ల మొక్కలు వేశామని తెలిపారు. మిగతా 40 ఎకరాల్లో కూడా వేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు బీఎస్ పాత్రుడు, ఎర్రునాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి : ఏవో


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో చిరంజీవి, పక్కన తహసీల్దార్

మాకవరపాలెం, జూలై 24 : మండలంలో అర్హత కలిగిన కౌలు రైతులను గుర్తించాలని ఏవో చిరంజీవి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. తహసీల్దార్ మురళీమోహన్‌రావు మాట్లాడుతూ పెండింగ్ రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.అనుమతులు లేకుండా ఇసుకను తరలించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కులధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని, పట్టాదార్ పాస్ పుస్తకాల దరఖాస్తులు పెండింగు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీటీ శంకర్‌రావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్ అందజేత


చెక్కు అందిస్తున్న సూర్యచంద్ర, కూటమి ఇతర నేతలు

గొలుగొండ, జూలై 24 : మండలంలోని చీడిగుమ్మల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త షేక్ రహమతుల్లా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయనకు రూ.50 వేల బీమా చెక్‌ను నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, చీడిగుమ్మల టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద, సీనియర్ టీడీపీ నాయకుడు భీమిరెడ్డి సత్యనారాయణ అందించారు. నియోజకవర్గంలో నాలుగో విడత జనసేన సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు గండెం దొరబాబు, రేగుబల్ల శివ, నాలుగు మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న పినపాత్రుని

బుచ్చెయ్యపేట, జూలై 24 : కౌలు రైతుల సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు పినపాత్రుని డిమాండ్ చేశారు. బుధవారం లోపూడిలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడుల నిమిత్తమై రైతు భరోసా నగదు అందజేయాలన్నారు. కేరళ తరహాలో రైతులకు చట్టం చేసి రైతాంగాన్ని అప్పుల ఊబి నుంచి కాపాడాలన్నారు. ఉపాధి కూలీల బకాయిలు తక్షణం విడుదల చేయాలని,200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600లు కూలీ చెల్లించాలని నాయుడు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సచివాలయ కార్యదర్శి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల రమణ, పినపాత్రుని తాతయ్యబాబు, గొంతిన సన్నిబాబు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే నిలుపుదల సముచిత నిర్ణయం

చోడవరం, జూలై 24 : వైసీపీ హయాంలో అడ్డగోలుగా నిర్వహించిన భూముల రీ-సర్వేను నిలిపేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు బైన కామేశ్వరరావు పేర్కొన్నారు. భూముల రీ-సర్వే పేరుతో వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించి భారీ అవినీతికి పాల్పడ్డారని, రైతులకు తీవ్ర ఆవేదన కలిగించారన్నారు. పాత రెవెన్యూ రికార్డులను ప్రామాణికంగా చేసి రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని బైన కామేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గరిష్ఠ స్థాయికి పెద్దేరు నీటిమట్టం



మాడుగుల రూరల్, జూలై 24 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రావిపాలెం పెద్దేరు జలాశయంలో నీటి నిల్వలు పుష్కలంగా చేరాయి. జలాశయం పరిసర ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో వర్షం నీరు భారీగా జలాశయంలోకి వచ్చి చేరింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రానికి 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.50 మీటర్లకి చేరిందని జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. రాత్రి ఎనిమిది గంటల తర్వాత 200 క్యూసెక్కుల నీరు గేటు తెరిచి విడిచిపెడతామని ఆయన తెలిపారు.

'ఆట'విడుపు

శిక్షా సప్తాహ్‌తో పాఠశాలల్లో సందడి


కె.కోటపాడు : చౌడువాడ హైస్కూల్‌లో చదరంగం ఆడుతున్న విద్యార్థులతో ఎంఈవో -2 డీవీడీ ప్రసాద్

ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు శిక్షా సప్తాహ్‌లో ఆటపాటలతో సరదగా గడిపారు. ఈ కార్యక్రమంతో పాఠశాలలు సంప్రదాయ ఆటలకు ఆలవాలంగా మారిపోయాయి. పిల్లల స్థాయిలను బట్టి ఉపాధ్యాయులు ఖో-ఖో, కబడ్డీ, చదరంగం, నాలుగు స్తంభాలు, కప్పగింతలు, కోతికొమ్మచ్చి, ఏడు పెంకులాట, వైకుంఠపాళీ, గోళీలాట, అష్టాచమ్మా, కుర్చీలాట, క్యారమ్స్, డస్టర్ గేమ్, రన్నింగ్ తదితర ఆటలను ఆడించారు. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు ఈ పాత కాలపు ఆటలను బాగా ఆస్వాదించారు. సరదాగా గడిపారు. ప్రతి పాఠశాల ఆటల మైదానంలా మారింది.

నర్సీపట్నం, జూలై 24 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి జ్ఞాపికలు అందజేశారు. పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం కె.లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.అప్పన్నపాలెంలో ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం వరహాబాబు, ఉపాధ్యాయుడు కుంభంపాటి సుబ్రహ్మణ్యం ఆటలు ఆడించారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం చోద్యం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో బుధవారం సప్తాహ్‌లో భాగంగా క్రీడల డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రత్నాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు కందూరు నూకరాజు, ఉపాధ్యాయులు రమణ, వరప్రసాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం హైస్కూలులో ఆటల సందడి

కె.కోటపాడు : మండలంలో గల అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్ర మంలో పాల్గొన్న ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్ మాట్లా డుతూ విద్యార్థుల్లో వికాసానికి ఇలాంటి సహ పాఠ్యాంశాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్ర మంలో హెచ్ఎం బి.సన్నిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు వి.త్రినాథరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆటల పోటీలను నిర్వహించారు. 6 నుంచి 10 తరగతులకు చెందిన విద్యార్థులకు ఆటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగ్గారావు, హెచ్ఎం ప్రసాద్, పీడీ గోవింద, టీచర్లు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సంప్రదాయ ఆటలు ద్వారా పిల్లల్లో వికాసం కలుగుతుందని, అందుకే శిక్షా సప్తాహ్‌లో ఈ ఆటలు పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో-2 ఉషారాణి తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


రోలుగుంట : కబడ్డీ ఆడుతున్న హైస్కూలు విద్యార్థులు


చోద్యం స్కూలులో..


దేవరాపల్లిలో..

బుచ్చెయ్యపేట : గ్రామీణ సంప్రదాయ క్రీడలు ఐక్యతకు చిహ్నాలని ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. తురకలపూడి హైస్కూల్, వడ్డాది కెజీబీవీ, జడ్పీ హైస్కూల్, విజయరామరాజుపేట, దిబ్బిడి, రాజాం హైస్కూల్‌లో క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్రబాబు, పీడీ సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితికి వైసీపీయే కారణం : సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

రావికమతం, జూలై 24 : గత వైసీపీ పాలన హయాంలో రోడ్లు, గ్రామాలు అభివృద్ధి కుంటుపడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విమర్శించారు. మండలంలోని జి.చీడిపల్లి గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు అధ్యక్షతన సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాలేపల్లి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేసిన తప్పిదాలు ప్రజలకు వెంటాడుతున్నాయన్నారు.రాష్ట్రంలో రోడ్లన్నీ గోతులమయం కావడంతో ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయ ని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి లేకుండా తయారైందన్నారు.ఇప్పుడు అధికారం లోకి వచ్చిన కూటమి పాలకులైనా రోడ్ల మరమ్మ తుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాలు, శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలపై గుర్తించి అధికారులకు వినతిపత్రాలు అందజే యాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 6న నర్సీపట్నంలో నిర్వహించనున్న పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని బాలేపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు డీసీహెచ్ క్రాంతికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు శివలంక కొండలరావు, మండల సమితి సభ్యులు సేనాపతి శ్రీను, కె.జోగారావు, బుంగా కుమారి పాల్గొన్నారు.

పాడి పశువులకు లంపిస్కిన్ నివారణ టీకాలు


టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

రోలుగుంట, జూలై 24 : పాడి పశువుల్లో ప్రాణాంతకమైన లంపిస్కిన్ వ్యాధి ప్రబలకుండా గ్రామాల్లో నివారణ టీకాలు వేస్తున్నట్టు పశువైద్యాధికారి నూకేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిబ్బలపాలెం, కొంతలం, ఎంకేపట్నం గ్రామాల్లో 192 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువుల్లో తీవ్ర జ్వరం, చర్మంపై పొక్కులు లాంటి ముద్దలు, అలసట, ఆకలి లేమి, నిలబడుటకు పడుకోవడానికి ఇబ్బంది పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప రైతు సేవ కేంద్రంలో సమాచారం అందించాలని కోరారు. అలాగే పసుపు, ముద్ద కర్పూరం, వేప నూనె కలిపిన మిశ్రమాన్ని బాహ్య లేపనంగా ముద్ద చర్మ లక్షణాలు ఉన్న చోట పూయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు బాల మౌనిక, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, శివ, భవాని, రాజు పాల్గొన్నారు.

మరింత పటిష్ఠంగా జనసేన కార్యకలాపాలు

నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు


మహేశ్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న రాజు

చోడవరం, జూలై 24 : నియోజకవర్గంలో జనసేన కార్యక్రమాలు మరింత పటిష్ఠంగా అమలు చేయనున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా శేమునాపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి తెలుగుచెర్ల మహేష్ జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను రాజు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాను కప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న జస్టిస్ సూర్యకళ

చోడవరం, జూలై 24 : స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యార్థి డిగ్రీ కళాశాలలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీనివల్ల ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారుడితో పాటు, అతనిపై ఆధారపడినకుటుంబాలకు కూడా రక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యత లేని రోడ్డు వేసి బిల్లు చేసుకునే యత్నం

గొలుగొండ, జూలై 24 : తూతూమంత్రంగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి బిల్లులు మంజూరుకు గ్రామతీర్మానం ఇవ్వాలని గ్రామకార్యర్శి ద్వారా వైసీపీ ప్రజా ప్రతినిధి తమపై ఒత్తిడి తెస్తున్నారని కొత్తఎల్లవరం గ్రామ సర్పంచ్ కొల్లి రాంబాబు ఆరోపించారు. మండలంలోని అరిలోవ అటవీ ప్రాంతంలో ఐదోమైలురాయి నుంచి జిల్లేడపూడి గ్రామం వరకూ గ్రావెల్ రోడ్డు నాణ్యత లేకుండా వేసి ఇప్పుడు బిల్లులు చేసుకోవడానికి ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు.

సొసైటీల నెత్తిన గోదాముల భారం

... 5వ పేజీ తరువాయి

సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి (నామినేటెడ్ పదవి) పదవి తీయిస్తానని బెదిరింపులకు పాల్పడేవారని తాజాగా వాపోతున్నారు. చివరకు డీసీసీబీ, జిల్లా సహకారశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆగమేఘాలపై బిల్లులు అప్‌లోడ్ చేసుకునేవారని చెబుతున్నారు.

నిరుపయోగంగా గోదాములు

ఇదిలావుండగా నాగులాపల్లి, నాతవరం మినహా మిగిలిన ఏడుచోట్ల గోదాములు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇప్పటివరకు పూర్తయిన గోదాములకు తాళాలు వేసి ఉంచడం మినహా వినియోగంలోకి తీసుకురాలేదు. కశింకోట మండలం జమాదులపాలెంలో నిర్మించిన గోదాముకు వెళ్లే రోడ్డులో కనీసం కారు కూడా వెళ్లదని, ఇక లారీల్లో ఆహార ధాన్యాలు తరలించేందుకు అవకాశంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళితే గ్రామం బయటి నుంచి రోడ్డు నిర్మించాలని సూచించారట. బుచ్చెయ్యపేటలో గోదాము పైకప్పుగా వేసిన సిమెంట్ రేకుల నుంచి వర్షం నీరు కారిపోతోందని స్థానికులు తెలిపారు. గోదాములు అవసరం లేకున్నా బలవంతంగా ఒప్పించి, నాబార్డు రుణం తీసుకువచ్చి సొసైటీలపై మోయలేని భారం మోపారని ఓ సొసైటీ ప్రతినిధి వాపోతున్నారు. ప్రస్తుతం నిర్మించిన తొమ్మిదింటిలో రెండు మినహా మిగిలిన గోదాములు ఎందుకూ ఉపయోగపడవని, అక్కడ ఆహార ధాన్యాలు నిల్వచేస్తే కాపలాగా షిఫ్ట్‌కు ఇద్దరు ముగ్గురు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని, పైగా నాసిరకం నిర్మాణాలలో నిల్వలు తడిసిపోతాయని వివరించారు. ఈ నేపథ్యంలో గోదాముల నాణ్యతపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపిస్తే లోపాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

78 మందికి నేత్ర వైద్య పరీక్షలు


నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

చోడవరం, జూలై 24 : స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 78 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డాక్టర్ అనిజ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ హరిచందన, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జోష్‌మిషన్ సేవలు అభినందనీయం

కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

రావికమతం, జూలై 24 : ఈ ప్రాంత ప్రజలకు జోష్ మిషన్ ఆర్‌సీఎం అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు కొనియాడారు.మండలంలోని ధర్మవరం గ్రామ సమీపంలో ఫాదర్ కె.వర్గీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోష్‌మిషన్ ఆర్‌సీఎం (ఆసుపత్రి) మూడో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పేదల కోసం ఫాదర్ వర్గీష్ ఉదారత గొప్పదన్నారు. ఆసుపత్రి నిర్మాణ ఫౌండర్ ఫాదర్ వర్గీష్ మాట్లాడుతూ కరోనా సమయంలో గొప్ప సేవలు అందించామన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించడమే తమ సంకల్పమన్నారు. ఈ కార్యక్రకమంలో నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కోట నీలవేణిగోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బుంగా బుల్లిబాబుపాల్గొన్నారు.

ఆకలి చావులకు ఆజ్యంలా బడ్జెట్

వ్యవసాయ కార్మిక సంఘం

దేవరాపల్లి, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆకలి చావులకు ఆజ్యం పోసే విధంగా ఉందంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బీటీ దొర విమర్శించారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఒక్కో లబ్ధిదారుడికి ఇవ్వాలని కోరుతుంటే, గత దాది కంటే తగ్గించారన్నారు.విద్య, వైద్య రంగాలకు పేపరు మీద చూపించడం ఆర్భాటాలు తప్పా ఆచరణకు యోగ్యం కావన్నారు. పేదలు, రైతులను విస్మరించడం ఎంతమాత్రం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ, చిన్నారావు, ఎరకన్న దొర, దముడు తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడులు నీళ్లపాలు

... 5వ పేజీ తరువాయి

జి.మోహన్‌రావు తెలిపారు. ఆర్‌జీఎల్ 2537 వరి విత్తనాలు 316 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 19 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 2.5 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 10 క్వింటాళ్ల విత్తనాల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఇండెంట్ పంపామన్నారు. విత్తనాలు రాగానే రైతులకు అందజేసి మళ్లీ నారు మడులు, లేదా ఎద పద్ధతిలో సాగు చేసుకొనేందుకు ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా..

... 5వ పేజీ తరువాయి

కల్పించామన్నారు. నర్సింగ్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ట్యూటర్ గ్రేడ్-1 పోస్టుకు కొద్దిరోజుల్లో ప్రమోషన్ కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీహెచ్ఈవో), పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)గా పదోన్నతులు కల్పించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సిద్ధమవుతోందన్నారు. ఈ మేరకు జోన్-1 పరిధిలో పదోన్నతులకు సంబంధించి 40 వరకు ఖాళీలున్నట్టు గుర్తించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సమాచారాన్ని అందించామన్నారు. ఆయా కేడర్లలో పదోన్నతులు పొందేందుకు అర్హులైన సీనియర్ జాబితాను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని పాటించాలని ఆదేశించినట్టు వెల్లడించారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



మాకవరపాలెం, జూలై 24 : మండలంలో పదవ తరగతి మార్కులు సాధించిన విద్యార్థులకు బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ నగదు పోత్సాహకాలు అందజేశారు. బుధవారం బూరుగుపాలెంలో పది ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన డి.గాయత్రికి రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎం.దుర్గాప్రసాద్‌కు రూ.2,500, తృతీయస్థానంలో ఐ.తేజకు రూ.వెయ్యి చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగరాజు, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి ఊతమిచ్చే బడ్జెట్

చోడవరం, జూలై 24 : ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం కేటాయింపులు చేసిందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు అమరావతి, పోలవరంలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయడం బాగుందన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యక నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా మరింత పురగోతి సాధించడానికి వీలుంటుందన్నారు.

సుద్దలపాలెంలో వైద్య శిబిరం

గొలుగొండ, జూలై 24 : మండలంలోని కంఠారం గ్రామపంచాయతీలోని సుద్దలపాలెం, వెంకట్రాంపురం గ్రామాల్లో జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుంజయ్ సుమారుగా 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రోయిన్ పనులకు నిధులు అందించాలి

మాకవరపాలెం, జూలై 24 : మండలంలో తూటిపాల గ్రోయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మర్రినాయుడు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 400 ఎకరాలకు ఈ గ్రోయిన్ ద్వారా సాగునీరు అందుతుందన్నారు. ఐదేళ్లుగా ఈ గ్రోయిన్ మరమ్మతుకు గురికావడంతో వరిసాగు రైతులు వరాధారం మీద ఆధారపడుతున్నారన్నారు. ఈయన వెంట బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ


యూరియా అందజేస్తున్న కూటమి నేతలు

కె.కోటపాడు, జూలై 24 : మండలంలోని కె.కోటపాడు, ఆర్‌వై అగ్రహారం, ఉగ్గినవలస, పోతనవలస గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో కె.కోటపాడు మాజీ సర్పంచ్ డోకల నరసింహమూర్తి, ఆర్‌వై అగ్రహారం గ్రామ సర్పంచ్ కన్నూరు లక్ష్మినాగభూషణం చేతుల మీదుగా రైతులకు యూరియాను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి సోమశేఖర్, వ్యవసాయశాఖ సహాయకులు వరహాలు దొర, కళ్యాణి, పార్టీ నాయకులు అచ్చిబాబు, బీజేపీ ఇన్‌చార్జి శరగడం సన్యాసినాయుడు, జనసేన ఇన్‌చార్జి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు నివాళి


నాతవరంలో నివాళి అర్పిస్తున్న సిబ్బంది

నాతవరం, జూలై 24 : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం ఎంపీడీవో వెంకటరమణకు బుధవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, ఏవో పార్థసారధి, ఈవోపీఆర్‌డీ మూర్తి, ఏపీఎం లక్ష్మి, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

మాకవరపాలెం : నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన నేపథ్యంలో మాకవరపాలెం ఎంపీడీవో చంద్రరావు, సిబ్బంది శ్రద్ధాంజలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఒక అధికారి ఈ విధంగా చనిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'అయ్యంకి'కి ఘన నివాళి



బుచ్చెయ్యపేట, జూలై 24 : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బుచ్చెయ్యపేట గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి.కృష్ణారావు వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయోద్యమకారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకుడుగా వెంకటరమణయ్య అందించిన సేవలు చిరస్మరణీయమైని కొనియాడారు.

నర్సీపట్నం : శాఖాగ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని నిర్వహించారు. బుధవారం గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ పాల్గొన్నారు.